News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK
చంద్రకాంత్
NEWS
తెలుగు దినపత్రిక


Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :184 | ఖమ్మం | బుధవారం, ఆగస్టు 21, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# గ్రామాలకు అభివృద్ధి వెలుగులు

- వచ్చే జనవరి నుంచి జన్మభూమి నిర్వహిస్తాం
- పంచాయతీలకు రూ.990 కోట్ల ఆర్థిక సంఘం నిధులు
- జలజీవన్ మిషన్ పథకానికి రూ.500 కోట్ల కేటాయింపు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



*రాబోయే ఐదేళ్లలో గ్రామాల్లో 17,500 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, 10 వేల కిలోమీటర్ల మేర మురుగు కాలువలు నిర్మిస్తాం. ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలన్నీ అక్టోబరు 2 నుంచి తిరిగి గ్రామాల్లో ప్రారంభించాలి. పంచాయతీల భవనాల ద్వారా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలి. వీధి దీపాల సమస్య పరిష్కారానికి సంబంధిత సంస్థలకు రూ. 482 కోట్ల బకాయిలు దశలవారీగా చెల్లించేందుకు అవకాశాలు పరిశీలించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు*

'వచ్చే ఏడాది జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తాం. గ్రామీణాభివృద్ధికి ముందుకు వచ్చే వారితో కలిసి కార్యక్రమాలు చేపడతాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.990 కోట్లు, జలజీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ.500 కోట్లు విడుదల చేస్తున్నాం. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు నింపి పంచాయతీరాజ్‌శాఖను బలోపేతం చేస్తాం. ప్రతి ఇంటికి, గ్రామానికి, ప్రాంతానికి ఏం అవసరమో గుర్తించి సదుపాయాలు కల్పిస్తాం' అని తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్,

వివరాలు 2లో..

# సచివాలయమే సముచితం

- తెలంగాణ తల్లి విగ్రహం అక్కడే ఏర్పాటు
- డిసెంబరు 9న ప్రతిష్ఠాపన
- రాజీవ్ ముందుచూపుతోనే దేశ ఆర్థిక పురోగతి
- ఆయన విగ్రహం పెడతామంటే విమర్శలా?
- మాజీ ప్రధాని జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి





డా.బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి రాష్ట్ర అధికార పీఠమైన సచివాలయమే అన్ని విధాలుగా సముచితమైన స్థానమైనందున అక్కడే సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని స్పష్టంచేశారు. ఈ ఏడాది డిసెంబరు 9న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిన రోజు, అందుకు కారకులైన కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆ తేదీని నిర్ణయించినట్లు వివరించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా సోమాజిగూడలోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'రాజీవ్ గాంధీ ముందుచూపు వల్లే భారతదేశం ఇప్పుడు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పటిష్ఠంగా మారింది. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు లభించాయి. 1980 దశకంలోనే దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ. మహాత్మాగాంధీ స్ఫూర్తితో రాజ్యాంగ సవరణ చేసి పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. ఇలా దేశ ప్రగతికి బాటలు వేసిన రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు ప్రతిష్ఠించడం సముచితం. కానీ కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అధికారంలోకి వస్తే విగ్రహాన్ని తొలగిస్తామంటున్నారు. ఎవరైనా చేతనైతే విగ్రహంపై చేయి వేయండి చూద్దాం' అంటూ సీఎం సవాల్ విసిరారు. 'ఓడిపోయినా భారాస నేతల తీరు మారలేదు. మీరు మళ్లీ అధికారంలోకి రావడం కలే. మీరు

వివరాలు 2లో..



## అదనంగా 2 వేల బస్సులు.. 3,500 మంది డ్రైవర్లు అవసరం

- ప్రతినెలా ఆర్టీసీకి రూ. 250-260 కోట్లు ఇవ్వాలి
- మహిళలకు ఉచిత ప్రయాణంపై సిద్ధమైన నివేదిక
- నేటి సమీక్షలో దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేస్తే.. బస్సుల్లో రద్దీ పెరుగుతుందని, దానికి అనుగుణంగా అదనంగా బస్సులు కొనాల్సి ఉంటుందని, ఖాళీలున్న డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అన్నీ సమకూరాక ఈ పథకం అమలు చేస్తే బాగుంటుందని, లేకపోతే చాలీచాలని బస్సులతో ఇబ్బందులు

వివరాలు 2లో..

## బ్రిటన్ వెళతా అనుమతించండి.. సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్



బ్రిటన్ వెళ్లడానికి అనుమతించాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ సీబీఐ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. యూకేలో చదువుతున్న కుమార్తె వద్దకు సెప్టెంబరు మొదటి వారంలో వెళ్లడానికి అనుమతించాలని కోరారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం సీబీఐ వివరణ కోరుతూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు... యూరప్‌లో వచ్చే 6 నెలల్లో 60 రోజులు పర్యటించేందుకు అనుమతించాలంటూ రెండో నిందితుడైన విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు కొనసాగాయి. సాయిరెడ్డి తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతంలో కూడా విదేశాలకు వెళ్లిరావడానికి ఈ కోర్టు అనుమతించిందన్నారు. దీనిపై సీబీఐ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తూ అనుమతిస్తే కేసుల విచారణలో జాప్యం జరుగుతుందన్నారు. ఇప్పటికే కేసు

వివరాలు 2లో..

## అక్రమ కేసులు, అరెస్టులు తప్ప జగన్ చేసిందేమీ లేదు

- ఐదేళ్ల పాలనలో జగన్ చేసిందేమీ లేదన్న కొల్లు రవీంద్ర
- మత్స్యకారుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసేలా జీవో 217 తీసుకొచ్చారని మండిపాటు
- మత్స్యకార సొసైటీల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని హామీ



:మాజీ ముఖ్యమంత్రి జగన్ పై మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు గుప్పించారు. అక్రమ కేసులు పెట్టడం, అక్రమంగా అరెస్టులు చేయడం తప్ప ఐదేళ్ల పాలనలో జగన్ చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జీవో 217 రద్దు అభినందన సభ ఈరోజు

వివరాలు 2లో..

## ఆత్మహత్య అని ఎలా చెప్పారు?..


### కోల్ కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు

- ఆసుపత్రి సిబ్బంది, పోలీసుల తీరుపై మండిపడ్డ కోర్టు
- ఎఫ్ఐఆర్ నమోదులో అంత జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్న
- బాధితురాలి పేరు, ఫొటో ప్రచురించడంపై మీడియా సంస్థలపై ఆగ్రహం



వివరాలు 2లో..

## ఫోన్ ట్యాపింగ్‌కు కేంద్రం అనుమతి అక్కర్లేదు



- అందుకు కేంద్ర, రాష్ట్రాలకు ప్రత్యేక అధికారం ఉంది
- అనధికారికంగా చేస్తే మూడేళ్ల జైలు, రూ.2 కోట్ల జరిమానా విధించొచ్చు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారంపై మాకెలాంటి సమాచారం లేదు
- హైకోర్టుకు నివేదించిన కేంద్రం

వివరాలు 2లో..

## రుణమాఫీ పట్ల .. అలసత్వం వద్దు




- బ్యాంకర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు
- 18 వేల కోట్లు రిలీజ్ చేస్తే.. రైతుకు చేరింది 7,500 కోట్లే
- రైతులకు వీలైనంత త్వరగా తిరిగి రుణాలివ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రుణమాఫీ ఆలస్యమైతే ఫలితం ఉండదని, బ్యాంకర్లు తమ సేవలను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు.

వివరాలు 2లో..



## వాగులు కాదు రోడ్లు.. ఇది మన హైదరాబాదే

వానలొద్దు బాబోయ్.. వానలొద్దు.. ఎలాగోలా బతుకుతాం.. సగటు నగర వాసుల నోటి నుంచి వస్తున్న మాటలివి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు చుక్కలు చూస్తున్నారు. వరద నీరు ఇళ్లలోకి చేరుతుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒకవైపు దుర్వాసన, మరోవైపు నీరు నిల్వ ఉండటంతో తినడానికి వంట కూడా వండుకోలేని పరిస్థితివచ్చిందని వారు వాపోతున్నారు. నగరంలో పలు చోట్ల ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి.అత్యవసరం ఉన్న వారు తప్పనిసరి పరిస్థితులలో వర్షపు నీటిలోనే అడుగులు

వివరాలు 2లో..

# అదనంగా 2 వేల బస్సులు.. 3,500 మంది డ్రైవర్లు అవసరం

ఎదురయ్యే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రధాన హామీల్లో ఒకటైన.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సీఎం చంద్రబాబు బుధవారం కీలక సమీక్ష నిర్వహించనున్నారు. ఆర్టీసీ అధికారులు తెలంగాణ, కర్ణాటకలో ఉచిత ప్రయాణంపై చేసిన అధ్యయనం వివరాలు తెలియజేయనున్నారు.

**కొత్త బస్సులు, డ్రైవర్లు కావాలి**

ప్రస్తుతం ఆర్టీసీలో 10 వేల బస్సులు ఉన్నాయి. వాటిలో సొంత బస్సులు 8,220. మిగిలినవి అద్దె బస్సులు. కొంతకాలం కిందట 1,480 కొత్త బస్సుల కొనగా.. వీటిలో ప్రతినెలా కొన్ని చొప్పున బస్సులు బాడీబిల్డింగ్ పూర్తిచేసుకొని డిపోలకు చేరుతున్నాయి. అయితే జగన్ ప్రభుత్వంలో కాలంచెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి కొనలేదు. ఇప్పుడు తీసుకుంటున్న కొత్త బస్సులన్నీ వాటి స్థానంలో సర్దుబాటు చేస్తున్నవే.

మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేస్తే.. మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుందని, అదనంగా కనీసం 2 వేల కొత్త బస్సులు అవసరమని అధికారులు అంచనా వేశారు.

చాలాకాలంగా ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు లేవు. పదవీ విరమణల కారణంగా డ్రైవర్ల కొరత మరింత పెరుగుతోంది. 3,500 మంది వరకు డ్రైవర్ పోస్టులు భర్తీచేయాలని అధికారులు నివేదిక రూపొందించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం అమలుతో ఆర్టీసీకి నెలకు రూ. 250–260 కోట్ల వరకు రాబడి కోల్పోనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ప్రతినెలా సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీకి ప్రతినెలా వచ్చే రాబడిలో 25 శాతం (దాదాపు రూ.125 కోట్లు) ప్రభుత్వం తీసుకుంటోంది. ఇకపై ఈ మొత్తాన్ని ప్రభుత్వం తీసుకోకూడదని, అలాగే మిగిలిన రూ.125–135 కోట్లు అదనంగా ప్రభుత్వమే, ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**రవాణాశాఖను గాడిన పెట్టేలా..**

గత వైకాపా ప్రభుత్వంలో గాడితప్పిన రవాణాశాఖపై కూడా సీఎం చంద్రబాబు బుధవారం సమీక్షించనున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి కేంద్రాలుగా ఉన్న నలుగురు జోనల్ సంయుక్త రవాణా కమిషనర్లు (జేటీసీలు)ని కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. కమిషనరేట్‌లో ఉండే పనుల్లో వీరిని భాగస్వామ్యులు చేశారు.

వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల జారీ సమయంలో అధికారులు చేతివాటం చూపకుండా, ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. తమ దందా పోతుందని కొందరు అధికారులు వాటిని వ్యతిరేకిస్తున్నారు.

రాష్ట్రాల సరిహద్దుల్లో రవాణా శాఖ చెక్‌పోస్టులు ఉండకూడదని గతంలో కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. అక్టోబరు నుంచి ఈ విధానం అమలు చేయాలని పేర్కొంది. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 16 చెక్‌పోస్టులు తొలగించారు. రవాణాశాఖలో ఈ చెక్‌పోస్టులు అనేవి అత్యంత అవినీతి కేంద్రాలనే పేరుంది. అక్కడ పోస్టింగ్‌ల కోసం అధికారులు ఎంత ఖర్చు చేసేందుకైనా వెనకాడరు. అందుకే చెక్‌పోస్టులు కొనసాగించాలని కొందరు పైరవీలు చేస్తున్నారు. సీఎం సమీక్షలో వీటన్నింటిపైనా చర్చ జరగనుంది.

# సచివాలయమే సముచితం

మాజీ ఎంపీ వి.హనుమంతరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించిన ఎమ్మెల్సీ కోదండరాం. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆది శ్రీనివాస్, మరో ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్

చింతమడకకే పరిమితం. పదేళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని వాళ్లు.. ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారు' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్ తదితరులు

**క్రీడల్లో మెరికలను తయారు చేస్తాం**

'దక్షిణ కొరియాలో ఒక యూనివర్సిటీకి చెందిన 16 మందికి ఒలింపిక్ పతకాలు వచ్చాయి. రాజీవ్‌గాంధీ ఆశయాల మేరకు యువతను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మా ప్రభుత్వం తలపెట్టింది. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. మారుమూల తండాలు, గూడేలు, పట్టణాల్లో మరుగునపడిన క్రీడాకారులను వెలికితీసి.. అంతర్జాతీయ స్థాయి శిక్షణతో మెరికల్లా తీర్చిదిద్దుతాం' అని సీఎం వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ పగలు, రాత్రి తేడా లేకుండా దేశం కోసం పనిచేశారని, కొందరు చరిత్రను మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజీవ్ వల్లే ఐటీ రంగానికి పునాదులు పడ్డాయని, హైదరాబాద్ నగరాభివృద్ధికి ఆ పునాదులే కారణమన్నారు. అనంతరం పలువురు క్రీడాకారులకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం అందజేశారు. రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించిన వారిలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి,

**సచివాలయ ఆవరణలో స్థల పరిశీలన**

సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం.. నేరుగా సచివాలయానికి వెళ్లారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయ ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. డిజైన్, ప్రణాళికలపై ఉన్నతాధికారులతో చర్చించారు.

**సీఎంను కలిసిన ఎమ్మెల్సీలు కోదండరాం, ఆమెర్ అలీఖాన్**

ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన కోదండరాం, ఆమెర్ అలీఖాన్‌లు మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. సీఎం వారిద్దరినీ అభినందించారు.

# ఫోన్ ట్యాపింగ్‌కు కేంద్రం అనుమతి అక్కర్లేదు

గత ప్రభుత్వం చేపట్టిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసులు దాఖలు చేసిన కౌంటర్లలో ఎక్కడా కేంద్రం ప్రస్తావన లేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంగళవారం హైకోర్టుకు నివేదించింది. దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఫోన్ ట్యాపింగ్ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక అధికారం ఉందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో చేపట్టే ట్యాపింగ్‌కు తమ అనుమతి అవసరంలేదంది. రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేటు వ్యక్తులతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తీసుకున్న సుమోటో పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ వాదనలు వినిపిస్తూ కౌంటరు దాఖలు చేసినట్లు తెలిపారు.

**నిబంధనలు పాటించాల్సిందే**

అదనపు సొలిసిటర్ జనరల్ దాఖలు చేసిన కౌంటర్‌లో ఏముందంటే..‘‘ఏ పరిస్థితుల్లో ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చో టెలిగ్రాఫిక్ నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ఆ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి. ట్యాపింగ్‌కు అనుమతిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హోంశాఖ కార్యదర్శులు ఆదేశాలు జారీ చేయవచ్చు. రెండింటికీ వేర్వేరుగా రివ్యూ కమిటీలు ఉంటాయి. అయితే ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వచ్చిందన్న దానిపై కారణాలు నమోదు చేయాల్సి ఉంటుంది. వాటిని రివ్యూ కమిటీ సమీక్షించి, ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ ఆదేశాలు 60 రోజుల వరకు అమల్లో ఉంటాయి. మళ్లీ పొడిగించుకోవచ్చు. అలా గరిష్ఠంగా 180 రోజుల వరకు పొడిగించుకునే వెసులుబాటు ఉంది. ట్యాపింగ్ తాలూకూ రికార్డులను ఆరు నెలల్లో ధ్వంసం చేయవచ్చు. కేంద్ర టెలికమ్యూనికేషన్ చట్టం–2023..

ఆ ఏడాది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంకా నిబంధనలు రూపొందించనందున అప్పటివరకు ప్రస్తుతం అమల్లో ఉన్న టెలిగ్రాఫ్ నిబంధనలే వర్తిస్తాయి. కొత్త చట్టం ప్రకారం అనుమతి లేకుండా, చట్టవిరుద్ధంగా ట్యాపింగ్‌కు పాల్పడితే 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, లేదంటే రూ.2 కోట్ల వరకు జరిమానా లేదా రెండూ కలిపి విధించవచ్చు' అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మంగళవారం కౌంటర్ దాఖలు చేశామని చెప్పడంతో విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# గ్రామాలకు అభివృద్ధి వెలుగులు

గ్రామీణాభివృద్ధిశాఖకు జవసత్వాలు అందించి పూర్వ వైభవం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ‘గ్రామాల్లో ప్రతి ఇంటికీ అవసరమైన విద్యుత్తు, వంట గ్యాస్, మరుగుదొడ్డి, నీటి కుళాయి వంటివి అందించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలి. వీధి దీపాలు, మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల యాజమాన్యం వంటి సౌకర్యాలు కల్పించాలి. గ్రామం నుంచి సమీప ప్రాంతాల అనుసంధానం కోసం రోడ్లు, మార్కెట్లు ఏర్పాటు చేయాల్సి' అని చంద్రబాబు అన్నారు. ‘గత ప్రభుత్వం తీరుతో గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన నిధులు దారి మళ్లాయి. కనీస స్థాయిలోనూ మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. పంచాయతీరాజ్‌శాఖకు రావలసిన నిధులు ఆర్థికశాఖ నుంచి విడుదల చేస్తున్నాం. జలజీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం ఉపయోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ పథకం కింద చేపట్టిన పనుల్లో రాష్ట్రం 19వ స్థానానికి దిగ జారిపోయిందంటే నాటి ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనం. జలజీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా నిధులు విడుదల చేస్తాం. కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. రాబోయే ఐదేళ్లలో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ పనుల పూర్తికి ఎంత సమయం పడుతుంది, ఏడాదికి ఎంత మేర పనులు పూర్తి చేయగలరనేది అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకుని వెళ్లాలి. నాటి తెదేపా ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తే.. వైకాపా ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. గ్రామాల్లో 60 శాతం లైట్లే వెలుగుతున్నాయి. ఐదేళ్లుగా నిధులు విడుదల చేయని కారణంగా నిర్వహణ లోపంతో మూలనపడ్డాయి. ఉపాధి హామీ పథకం పనులపై విధిగా గ్రామ సభలు నిర్వహించాలి. కొత్త వ్యవస్థలు వచ్చినా సర్పంచిని గౌరవించుకోవలసిన అవసరం ఉంది' అని ముఖ్యమంత్రి అన్నారు. ‘పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నేడు మళ్లీ నిధులు, కొత్త విధానాల ద్వారా గ్రామాల్లో సమూల మార్పులు తీసుకొస్తాం. పంచాయతీరాజ్‌శాఖలో గత కొద్ది రోజుల్లో పలు నిర్ణయాలు తీసుకున్నాం. సంస్కరణలు అమలు చేస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వివరించారు. 2014–19 మధ్య ఎన్టీఆర్ జలసిరి కింద 32,693 బోర్లు వేసి పంపు సెట్లు బిగిస్తే.. గత ప్రభుత్వం 2,580 పంపుసెట్లే ఇచ్చిందని అధికారులు సీఎంకు తెలిపారు.

## అక్రమ కేసులు, అరెస్టులు తప్ప జగన్ చేసిందేమీ లేదు

- మొదటి పేజి తరువాయి

ఏలేశ్వరంలో జరిగింది. ఈ సభకు కొల్లు రవీంద్ర కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ... మత్స్యకారుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసేలా జీవో 217 తీసుకొచ్చారని... మత్స్యకారులకు ఉన్న హక్కులను ప్రైవేటు పరం చేసేందుకు యత్నించారని విమర్శించారు. ఈ జీవోను రద్దు చేయడం ద్వారా మత్స్యకారుల హక్కులను కాపాడామని చెప్పారు. త్వరలోనే మత్స్యకార సొసైటీల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రుణమాఫీ పట్ల .. అలసత్వం వద్దు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తే రైతులకు ఇప్పటి వరకు చేరింది 7,500 కోట్లు మాత్రమేనని అన్నారు. రుణాలు మాఫీ అయిన రైతులకు వీలైనంత త్వరగా లోన్లు ఇవ్వాలని అన్నారు.

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని అన్నారు. ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని కోరారు. లెక్కలు కాదని, ఆత్మతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయం తో పాటు పారిశ్రామిక రంగానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుంది. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నామని అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఫస్ట్ క్వార్టర్ లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నట్టు చెప్పారు. తొలి క్వార్టర్ లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులో ఇప్పటివరకు 40.62% వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం నగదు నిల్వలనిష్పత్తి మొదటి క్వార్టర్లో 127. 29 శాతానికి మెరుగుపడడం ఆసక్తికరమైన అంశమని అన్నారు.

## వాగులు కాదు రోడ్లు.. ఇది మన హైదరాబాదే

- మొదటి పేజి తరువాయి

వేస్తున్నారు. గతంలో మ్యాన్ హోల్స్ తెరిచి ఉండి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు వారిని మరింత భయపెడుతున్నాయి. పలు చోట్ల సామాన్యులే ట్రాఫిక్ సిబ్బంది అవతారమెత్తారు. రోడ్లపై నిల్చొని వాహనదారులను, ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా సహాయం చేస్తున్నారు.

**నిండుకుండలా హుస్సేన్‌సాగర్**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండంతో నీటిమట్టం అంతకంతకూ పైకి చేరుతోంది. పరిశీలించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత హుస్సేన్ సాగర్ దిగువన ఉన్న కాలనీలోని ప్రజలను అప్రమతంగా ఉండాలని సూచించారు.

## ఆత్మహత్య అని ఎలా చెప్పారు?..

కోల్ కతా ఆర్జీ కర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారం ఘటనలో ఆసుపత్రి సిబ్బందితో పాటు పోలీసులు, బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతదేహం పడి ఉన్న తీరును చూశాక అది ఆత్మహత్యని ఎలా భావించారని వైద్య సిబ్బందిని ప్రశ్నించింది. డాక్టర్ ఆత్మహత్య చేసుకుందని బాధితురాలి కుటుంబానికి చెప్పడం వెనక కారణమేంటని నిలదీసింది. అదేవిధంగా ఈ దారుణం ఉదయం చోటుచేసుకోగా మధ్యాహ్నం 4 గంటలకు పోస్టుమార్టం పూర్తయిందని గుర్తుచేస్తూ.. ఎఫ్ఐఆర్ మాత్రం రాత్రి 11:45 గంటలకు నమోదు చేసినట్లు ఉందని వెల్లడించింది. అంత జాప్యం ఎందుకు జరిగిందని, అప్పటి వరకు ఏంచేస్తున్నారని పోలీసులను ప్రశ్నించింది. ఈ దారుణానికి సంబంధించిన వార్తలలో బాధిత డాక్టర్ పేరు, ఫొటోలను కొన్ని మీడియా సంస్థలు ప్రచురించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, కోల్ కతా వైద్యురాలి హత్యాచారం కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ను మరో కాలేజీకి బదిలీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ హత్యాచారం కేసులో ప్రిన్సిపాల్ ప్రవర్తనపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మరో కాలేజీకి ఆయనను ఎలా పంపించారని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ బెంచ్ ప్రశ్నించింది.

## బ్రిటన్ వెళతా అనుమతించండి.. సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

- మొదటి పేజి తరువాయి

విచారణ ముందుకుసాగడంలేదని, అనుమతిని నిరాకరించాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి నిర్ణయాన్ని ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు.

**బెంగళూరు నుంచి తాడేపల్లికి చేరుకున్న జగన్**

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ మంగళవారం తాడేపల్లికి తిరిగొచ్చారు. ఈ నెల 15న ఆయన బెంగళూరు వెళ్లారు. జూన్ నుంచి ఇప్పటివరకూ మొత్తం ఆరుసార్లు అక్కడికి వెళ్లొచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో జగన్‌కు వైకాపా నేతలు స్వాగతం పలికారు. వచ్చే నెలలో ఆయన యూకే పర్యటనకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న డిప్లమాటిక్ పాస్‌పోర్టును.. ఈ నెల 1న కార్యాలయంలో సమర్పించి సాధారణ పాస్‌పోర్టు తీసుకున్నారు.

## నా మాటలు గుర్తు పెట్టుకో రేవంత్...


“నా మాటలు గుర్తు పెట్టుకో ‘చీప్’ మినిస్టర్ రేవంత్... మేం అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే బాబాసాహెబ్ అంబేద్కర్, సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం” అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పంజాగుట్ట వద్ద రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసిన సీఎం రేవంత్ రెడ్డి... కేటీఆర్‌పై మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్స్ వేదికగా స్పందించారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అంబేద్కర్, సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తామన్నారు. నీలాంటి ఢిల్లీ బానిస తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణను అర్థం చేసుకోలేరని విమర్శించారు. చిన్నపిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన నైజం, వ్యక్తిత్వం, ఆయన పెంపకాన్ని సూచిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మానసిక రుగ్మత నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని చురక అంటించారు.

## అంగరంగ వైభవంగా జారంపేట వేంకటేశ్వరస్వామికీ భూదేవి శ్రీదేవిలతో కల్యాణం


- కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే బక్కనీ నర్సింలు
- కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్, అందే బాబయ్య, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్
- మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి దంపతులు






**సి కే న్యూస్ : ఆగస్టు 19:** షాద్ నగర్ పట్టణంలోని జనంపేట దేవాలయం లో కొలువైన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికీ శ్రీదేవి భూదేవిలతో కళ్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామికీ భూదేవి శ్రీదేవిలా కళ్యాణంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి దంపతులు,న్యాయవాది జగన్మోహన్ రెడ్డి దంపతులు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల మధ్య అంగరంగ వైభవంగా లక్ష్మి వెంకటేశ్వర సాములోరి కల్యాణం కొనసాగుతుంది. స్వామి అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలు, వేద పారాయణాలు, మంగళ వాయిద్యాలు, కరతాళ ధ్వనుల మధ్య అర్చకులు, వేద పండితులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపించారు. లక్ష్మీ సమేతుడైన వేంకటేశ్వరుడుని ఆరాధిస్తూ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ముల్లోకాది దేవతలు చూస్తుండగా వేంకటేశ్వర స్వామి శ్రీదేవి, భూదేవి మెడలో మంగళ్యధారణ చేశారు. ఆలయ ప్రాంగణం "నమో వెంకటేశాయ, గోవిందా" అనే నామస్మరణతో స్వామి అమ్మవార్ల కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు తమ జన్మ ధన్యమైందని భావిస్తూ ఆనంద పరవశులయ్యారు. మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సిములు, బీజేపీ నాయకులు అందె బాబాయ్య ముదిరాజ్,కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ముదిరాజ్, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్,ఈ సందర్భంగా ఆలయంలో వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిదంగా ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బ్రాహ్మణులు, మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి కాబోయే వధూవరులు మృతి...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20,** అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన తాటి ప్రసాద్ అనే యువకునికి పాల్వంచ మండలానికి చెందిన వీకే రామవరం గ్రామానికి చెందిన యువతికి కొద్దిరోజుల క్రితం ఇరు కుటుంబాల పెద్దలు పెళ్లి సంబంధం కుదుర్చుకున్నారు.. మంచి రోజులు చూసి పెండ్లి తంతుకు ముహూర్తం పెట్టుకుందామని అనుకుంటూ ఆనందంగా ఉన్న కుటుంబాల్లో.... ట్రాక్టర్ రూపంలో కాబోయే వధూవరులను మృత్యు వెంటాడింది.

వికే రామవరం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి కాబోయే వధూవరులు మృతి చెందడంతో.... ఆ ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది...

## బాల వెలుగులో ఘనంగా తోట సంపూర్ణ జన్మదిన వేడుకలు.

- క్వింటా బియ్యం వితరణ సహపంక్తి భోజనాలకు ఆర్థిక సహాయం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,** మణుగూరు ఏరియా పీకే ఓసి సింగరేణి ఉద్యోగి తోట శేఖర్ సతీమణి సంపూర్ణ జన్మదిన వేడుకలు సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస పూర్వ బాల వెలుగు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు సహపంక్తి భోజనాలకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని పేద విద్యార్థులను ఆదుకోవాలనే మంచి తలంపుకు విద్యార్థులు కృతజ్ఞతలు, పెద్దలు ఆశీస్సులు అందజేసి సంపూర్ణ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులు శేఖర్ కు రాఖీని కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తోట శేఖర్, సంపూర్ణ, ఇరువురు కుమారులు ధృవ్ నిఖిత్, కీయాన్ష్, నాయకులు సిల్వేరు గట్టయ్య, సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా, కె రామా చారి, వరుణ్ తేజ్, అంగోత్ మంగీలాల్, పాఠశాల నిర్వహకులు బి జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,** భారతదేశ మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జన్మదినం సందర్భంగా, స్థానిక సాయిబాబా గుడి సెంటర్ ముందు గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ళ నరేష్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచల శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అర్పించారు, అనంతరం క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యుల వెంకటరావు మాట్లాడుతూ భారతదేశం లో 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కు వినిగించు కుంటున్నారంటే దానికి కారణం రాజీవ్ గాంధీ ఆలోచన విధానం వల్లే సాధ్యమైందని, టెలికాం రంగంలో దేశాన్ని ఆ రోజుల్లోనే ముందుకు నడిపించారని, దేశ ప్రజల సేవ చేస్తూ ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీని ఆయన మాట్లాడారు.

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులర్పించిన వారిలో టీపీసీసీ బుడగం శ్రీనివాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రమేష్ గౌడ్,రత్నం రమాకాంత్,బంబోతుల రాజీవ్, పెద్దనేని శ్రీను,ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, భీమవరపు వెంకట్ రెడ్డి,పి.నాగేంద్ర,యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను ప్రకాష్,చాట్ల రవికుమార్,కొప్పుల రాజా, సబ్బలూరి భాను,తోకల ప్రసాద్, బోడ మణి, రమాదేవి, అనసూర్య,యూత్ కాంగ్రెస్,మహిళ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**సీ కే న్యూస్ చేగుంట 21రిపోటర్ (కొండి శ్రీనివాస్)** మంగళ వారం 20.08.2024 నాడు ఈ రోజు అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి , భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ 80 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, పోతారెడ్డిపేట తాజా మాజీ ఎంపీటీసీ మంద చంద్రసాగర్, మాజీ టెలికం బోర్డు మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లె అనిల్,అక్బర్ పేట గ్రామ అధ్యక్షుడు కూతురి చందు,భూంపల్లి గ్రామ అధ్యక్షుడు ఎల్లన్న సురేందర్ రెడ్డి, బేగంపేట గ్రామ అధ్యక్షుడు ఉద్ధమారి సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్తే వెంకటేశం, షేర్ పల్లి స్వామి, ఉద్ధమారి నవీన్, పుల్లని ఎల్లయ్య, పొట్టేల స్వామి తదితరులు పాల్గొన్నారు.




## స్కూళ్లకు సెలవులపై కలెక్టర్లకు మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు




**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్ష సూచన, స్థానిక పరిస్థితులను బట్టి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలన్నారు. గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ వీలైనంత మట్టుకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## ప్రజలకు సేవ చేసేందుకే వైద్యులు ఉన్నది.

- వైద్యులు దేవుడితో సమానం.
- రెవెన్యూ హౌసింగ్ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,**
ములకలపల్లి మండలంలోని మంగపేట గ్రామంలో కోటి 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘునాథరెడ్డి, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా మంత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని అన్ని గదులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పంచాయతీరాజ్ అధికారులతో ఇంకా చేయవలసిన భవన నిర్మాణ పనులు త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్యశాఖ అధికారితో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కావలసిన పరికరాలు మందులు సిబ్బంది తదితర అవసరాలకు సంబంధించి నివేదికలు కలెక్టర్ కు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్యులతో మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానం అని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని, పల్లె ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఆశయంతో పక్కా భవనాలు నిర్మించడంతో పాటూ వైద్య సిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి అన్నారు. వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు సేవలందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే మళ్లీ పరిశీలనకు వస్తానని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, కొత్తగూడెం ఆర్డీవో మధు,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు మరియు వైద్యశాఖ అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,** టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. శాసనసభ్యులు తెల్లం వెంకటరావు దగ్గర ఉండి బుడగం శ్రీనివాస్ తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బుడగం శ్రీనివాస్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో

మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, రత్నం రమాకాంత్,బంబోతుల రాజీవ్, పెద్దనేని శ్రీను,ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, భీమవరపు వెంకట్ రెడ్డి,పి.నాగేంద్ర,యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను ప్రకాష్,చాట్ల రవికుమార్,కొప్పుల రాజా, సబ్బలూరి భాను, బోడ మణి, రమాదేవి, అనసూర్య,యూత్ కాంగ్రెస్,మహిళ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండల పరిధిలోని పాత సారపాక, వైయస్సార్ కాలనీ, ముత్యాలం పేట, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

గ్రామాలలో అత్యవసర మైన అభివృద్ధి పనులకు మంగళవారం రోజు శంకుస్థాపన చేసి ఆ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలు చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

# కనిపించని హక్కుల కోసం ఇండియన్ ఈజ్ మెంట్ చట్టం

సమాజంలో ప్రతి మనిషీ తమ పొరుగు వారికి ఏదో ఒక రకంగా సహాయపడుతూనే ఉంటాడు. బయటకు కనపడే విధమైనవి మాత్రమే కాకుండా ప్రత్యేకించి చూస్తే తప్ప కనబడని సహాయాలు కూడా ఉంటాయి. ఇలా కనబడని సహాయాలు ప్రతి ఒక్కరికీ అవసరమైనవై కూడా ఉంటాయి. ఇలాంటి సహాయాలను ఒకరి నుండి మరొకరికి లభించే సౌలభ్యాలు అని కూడా చెప్పవచ్చు. వ్యక్తులు వారి వారి స్వస్థలాలకు లేదా పని చేసే ప్రదేశాలకు వెళ్ళడానికి తమ సొంత ఇంటి ముందునుండి లేదా తమ ఆధీనంలో ఉన్న స్థలం నుండి ఇతరులు నడవడానికి బాట లేదా దారి ఏర్పాటు చేయడం నీటి అవసరాలకు ఉపయోగించుకోవడానికి అనుమతి ఇవ్వడం గాలి వెలుతురు ధారాళంగా రావడాన్ని అడ్డుకోకుండా ఉండడం లాంటి సౌలభ్యాలను వ్యక్తులు నిరంతరం పొందుతూనే ఉంటారు. వ్యక్తుల మధ్య సత్సంబంధాలు ఉన్నంత కాలం ఇలాంటి సౌలభ్యాలకు ఎటువంటి అడ్డంకి ఉండదు. కానీ వ్యక్తుల మధ్య సత్సంబంధాలు చెడిపోయినప్పుడు సౌలభ్యాలు పొందుతున్న వ్యక్తుల పరిస్థితి ఏమిటి? వ్యక్తులు మాత్రమే కాకుండా కొన్ని సార్లు వారి కుటుంబాలు కూడా సమస్యల్లో పడతాయి. కొన్ని సందర్భాల్లో పరిస్థితులు జటిలమై కుటుంబాల నుండి కొన్ని ఊర్ల మధ్య కూడా సమస్య విస్తరించే అవకాశం లేకపోలేదు. ఇలాంటి కారణాల వల్లనే సౌలభ్యాలు పొందడాన్ని కూడా ఒక హక్కుగా భావించి దానికోసం చట్టం చేయాల్సిన అవసరం ఏర్పడి ఉండవచ్చు. సాధారణంగా హక్కులనేవి మనిషి స్వేచ్ఛగా నిర్భయంగా జీవించడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్థాయి. ఈ స్వేచ్ఛలోనే మనం మనకు తెలియకుండానే బయటకు కనిపించని కొన్ని హక్కులను అనుభవిస్తున్నాం. మనిషి తన రోజువారీ జీవితంలో కొన్ని రకాల తనకే తెలియని హక్కులను కలిగి ఉండి వాటిని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ కూడా వాటి గురించి పట్టింపు గాని అవగాహన గాని లేకుండా ఉంటున్నాడు. ఈ రకమైన హక్కులను అనుభోగహక్కులు అంటారు. ఇండియన్ ఈజ్ మెంట్ యాక్టు లేదా భారత అనుభోగహక్కుల చట్టం 1882 గా రూపొందించబడిన ఈ చట్టాన్ని సౌలభ్యాల చట్టం అని కూడా పిలుస్తారు. అందుకే జాతి మతం కులం భాష భేదాలు లేదా ఏవైనా ఇతర ఆర్థిక సామాజిక హొదాలతో సంబంధం లేకుండా అనుభోగహక్కులు సార్వత్రికమైనవై ఆయా సందర్భానుసారం పౌరులందరికీ సమానంగా వర్తిస్తాయి. 1882 నాటి ఇండియన్ ఈజ్‌మెంట్స్ చట్టం భారతదేశంలో ఇప్పటికీ అమలులో ఉంది.

అనుభోగహక్కు(సౌలభ్యాల హక్కు) అంటే ఒకరికి సొంతమైన ఆస్తిని కొన్ని పరిమితులకు లోబడి ఉపయోగించుకోవడానికి మరొకరికి ఉండే నాన్ పొసెసివ్ (యాజమాన్యపు హక్కు లేనిది) హక్కు. సౌలభ్యాల హక్కు అనేది సాధారణంగా ఒక రకమైన కనిపించని ఆస్థి హక్కుగా పరిగణించబడుతుంది. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఒక వ్యక్తి యొక్క భూమిని ఉపయోగించడానికి దాని హక్కుదారులు కాని వేరొకరికి లేదా కొంతమందికి పరిమిత హక్కును అందించడానికి ఈజ్ మెంట్ చట్టం అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు ఎవరైనా తమ పొరుగువారి భూమి మీదుగా తమ ఇంటికి లేదా ఒక పొలం నుండి మరొకరి పొలానికి చేరుకోవడానికి వారి భూమిలో నుండి దారిని ఉపయోగించుకునే సౌలభ్యాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. ఈ హక్కును భూమి సొంతదారు లేదా యజమాని అడ్డుకోవడం కుదరదు. ఇది శాశ్వతమైన హక్కుగా కనిపించినప్పటికీ యాజమాన్య హక్కు కాదు. అలాగే భూమి సొంతదారుకు దారి హక్కు పొందుతున్న వారి వలన ఎలాంటి నష్టాన్ని కలిగించడాన్ని కూడా ఈ చట్టం అనుమతించదు. ఈస్ మెంట్ చట్టం లేదా అనుభోగహక్కుల చట్టం లేదా సౌలభ్యాల హక్కు చట్టం నాలుగు రకాల హక్కులను నిర్వచించింది. సతత అనుభోగహక్కు (కంటిన్యూస్ రైట్) అసతత అనుభోగహక్కు (డిస్కంటిన్యూస్ రైట్) ప్రకటిత మరియు అప్రకటిత అనుభోగహక్కు. ప్రతి పౌరుడూ స్వతహాగా తాను స్వేచ్ఛగా జీవించడానికి అవసరమైన రాజ్యాంగ బద్ధమైన హక్కులను కలిగి ఉంటాడు. తనకు సొంతమైన ఇండ్లు భవనాల మీద తన అజమాయిషీ కలిగివున్న భూములపైనా లేదా పొలాలు పంట చేలు లేదా ఇతర స్థిరాస్తులపైన సంపూర్ణ అధికారం మరియు హక్కును కలిగి ఉంటాడు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇదే విధమైన హక్కులను కలిగి ఉంటారు. అయితే అదే సమయంలో ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వారి అజమాయిషీలో వున్న భూములపైనా లేదా పొలాలు పంట చేలు లేదా ఇతర స్థిరాస్తులలో కొంత భాగంపైనా తాత్కాలికంగా గాని ఒక్కోసారి శాశ్వతమైన విధంగా గాని పరిమితులకు లోబడిన హక్కును కూడా పౌరులు కలిగి ఉంటారు. ఇటువంటి హక్కులకు కూడా చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించబడిందే ఇండియన్ ఈజ్ మెంట్ చట్టం.

ఈ చట్ట ప్రకారం ఒక వ్యక్తి తన పొలానికి చేరుకోవడానికి మరొకరికి చెందిన పొలం మీదుగా వెళ్లేందుకు దారి హక్కును కలిగి ఉంటాడు. దీనిని అసతత అనుభోగహక్కు లేదా డిస్కంటిన్యూస్ రైట్ గా చెప్పవచ్చు. పంట కాలువలు లేదా నీటి కాలువలకు కూడా ఇదే వర్తిస్తుంది. ఈ హక్కును ఎవరూ కాదనలేరు. అలాగే ఒక వ్యక్తి తన ఇంటికి గాలి వెలుతురు ధారాళంగా వచ్చేందుకు ఆ వ్యక్తి ఇంటి పక్కన లేదా ముందు గానీ వెనుక గాని ఉండే గృహ యజమాని ఏ రకంగానూ అడ్డు పడకూడదు. దీనిని సతత అనుభోగహక్కు లేదా కంటిన్యూస్ రైట్ గా పిలవచ్చు. ఒక వ్యక్తికి చెందిన స్థలం నుండి లేదా ఇంటి మీదుగా ఒక నిర్దిష్టమైన ప్రయోజనాన్ని ఆశించి చేసే ఏదైనా పనిని ప్రకటిత అనుభోగహక్కుగా పిలుస్తారు. అంటే ఒక వ్యక్తి స్థలం మీదుగా నీటి సౌకర్యం (వాటర్ కనెక్షన్) లేదా డిష్ కేబుల్ వంటివి మరొకరి ఇంటికి పంపడానికి ఉపయోగించుకోవడం. ఈ పని గురించి అవగాహన ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా గమనించినప్పుడు ఆ వివరాలు బయటకు తెలుస్తాయి. ఇక ఒక వ్యక్తి తన ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో తనకు ఇబ్బందికరమైన ఏదైనా నిర్మాణం జరుగుతుంటే దానిని ఆపగలిగె హక్కు అప్రకటిత అనుభోగహక్కుగా పిలువబడుతుంది. ఉదాహరణకు తన ఇంటి పక్కన గల ఖాళీ స్థలాల్లో మిల్లులు లేదా పేలుడు పదార్థాలకు సంబంధించిన గోడౌను ఇబ్బంది కలుగజేసే ఏవైనా నిర్మాణాలను ఆపే హక్కును ఇది సూచిస్తుంది. ఇది అప్రకటిత అనుభోగహక్కు. పౌరులందరూ తమ హక్కులను వినియోగించుకుంటూ ఇతరులకు నష్టం కలిగించకుండా పరోక్షంగా వారి హక్కులను కూడా పరిమితులకు లోబడి వినియోగించుకునే అవకాశాన్ని అనుభోగహక్కుల చట్టం కల్పిస్తుంది. అంతే కాకుండా ఇటువంటి హక్కులకు నిజమైన భంగం వాటిల్లినప్పుడు నష్ట పరిహారం కోసం దావా వేసే వెసులుబాటును కూడా ఈ చట్టం కల్పించింది. వందేళ్లకు పూర్వమే ఇలాంటి ఒక చట్టం రూపుదిద్దుకుందంటే సమస్య అనాది నుండే ఉందన్నమాట. అంతెందుకు రామాయణ మహాభారతాలలో జరిగిన యుద్దాలు సైతం ఒకరకంగా ఆస్థి హక్కుల కోసం జరిగినవే అంటే ఒప్పుకోవాల్సిందే(ధర్మ సంస్థాపన కోసం అనేది అసలు ఉద్దేశ్యం). అప్పుడంటే దేవతలు దగ్గరుండి మరీ సమస్యలు పరిష్కరించేవారని మనం నమ్ముతున్నాం. కానీ నేటి మన నాగరిక సమాజంలో ఇలాంటివి కుదరదు కదా. మనిషి తన హక్కులను అనుభవిస్తూ ఇతరుల హక్కులను కూడా పరిరక్షించడం ఎల్లకాలం కుదరదు. దీనికోసం బయట నుండి ఒక నియంత్రణ విధానం లేదా కట్టుబాటు అవసరం అవుతుంది. ఈ కట్టుబాట్లే రూపాతరం చెంది చట్టాలుగా అమలు చేయబడుతున్నాయి. ప్రతి చట్టం కూడా దేనికదే ప్రత్యేకమైంది. కానీ భారత అనుభోగహక్కుల చట్టం చాలా విలక్షణమైనది. మనవి కాని ఆస్థులపై కూడా ఒకరకమైన పరోక్ష హక్కులను ఈ చట్టం ప్రసాదించింది. ఐతే ఈ హక్కులను హక్కులుగా కాకుండా సౌలభ్యాలుగా మాత్రమే చూడాలి. మనం పొందే సౌలభ్యాలు ఇతరుల హక్కులను భంగపరచేవిగా ఉండకూడదనేది భారత అనుభోగహక్కుల చట్టం యొక్క ఉవాచ.




## నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి..

**అంతర్జాతీయ మానవ హక్కుల కమీషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ వంశీ రెడ్డి...**



సి కే న్యూస్ (సంపత్) ఆగస్ట్ 20:నిర్భయ చట్టం వచ్చి 12 ఏళ్లు దాటుతున్న ఆ చట్టం ఇప్పటికీ పూర్తి స్థాయి లో అమలు కావడం లేదని అంతర్జాతీయ మానవ హక్కుల కమీషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రదాన కార్యదర్శి పటేల్ వంశీ రెడ్డి మంగళవారం అన్నారు. భారతదేశంలో వరుసగా జరుగుతున్న హత్యాచారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ, పోక్సో చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బేటి బచావొ - బేటి పడావో అన్న నినాదం కానరావడం లేదని ఆరోపించారు. విద్య, ఉద్యోగ, స్వగృహం, రోడ్లపై మహిళలకు రక్షణ లేదని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మద్యపానం, అసాంఘిక నీలి చిత్రాలు అరికట్టడానికి ఎలాంటి ప్రభావం లేకపోవడంతో ప్రభుత్వం విఫలమైంది. యువత ఉపాధి లేక వాటికి బానిసై ఇటువంటి అరాచకాలకు పాల్పడే అవకాశాలకు ఇదొక కారణంగా మిగిలింది. ఇటీవక కలకత్తా లో జరిగిన వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటనపై సిబిఐ విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## కోల్ కత్తా హత్య చార సంఘటనకు నిరసనగా పి ఓ డబ్ల్యు ,పి డి ఎస్ యు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20, మణుగూరులో దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన సంఘటన కోల్ కత్తా హత్య చార సంఘటనకు నిరసనగా ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యు) ప్రగతిశీల విద్యార్థి సంఘం పిడిఎస్ యు ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు పట్టణంలో విద్యార్థినులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ లో జరిగిన సభలో పి ఓ డబ్ల్యు భద్రాచలం డివిజన్ కార్యదర్శి సున్నం భూలక్ష్మి, ప్రగతిశీల విద్యార్థి సంఘం పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం ప్రణయ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కోల్ కత్తా డాక్టర్ పై సామూహిక అత్యాచారం ఆపై హత్య సంఘటనను దేశవ్యాప్తంగా ప్రజలు నిరసించాలన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సంఘటన పట్ల కఠినంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తిచే జ్యుడీషియల్ విచారణ జరిపించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటన పునరావతం కాకుండా చూడాలని మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉందన్నారు. వుయ్ వాంట్ జస్టిస్ అంటూ విద్యార్థినుల నినాదాలు తో పట్టణంలో హొరెత్తించారు. చేశారు.ర్యాలీకు సహకరించిన స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలకు విద్యార్థినిలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం ప్రణయ్, (పిడి ఎస్ యు) పిఓడబ్ల్యూ నాయకులు సున్నం భూలక్ష్మి, రాపర్తి లక్ష్మి, నరసమ్మ, పుష్ప, రజిత, శాంతకుమారి, ఐ ఎఫ్ టియు నాయకులు యస్ డి నా సర్ పాషా మిడిదొడ్ల నాగేశ్వరరావు, అంగోత్ మంగీలాల్, పి వై ఎల్ నాయకులు సాధన పల్లి రవి,న్యూ డెమోక్రసీ నాయకులు నాయిని కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## ప.బె సి ఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి.

**- సిపిఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం.**



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20, కలకత్తా మెడికల్ కాలేజీలో చోటుచేసుకున్న అమానుషణ ఘటనకు బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిపిఐ పట్టణ నాయకులు సాధన పల్లి సతీష్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ సాక్షాత్తు మహిళా ముఖ్యమంత్రి ప్రాతినిధ్య వహిస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా మెడికల్ కళాశాలలో మహిళ జూనియర్ డాక్టర్ పై సామూహిక హత్యాచారం జరగడం దుర్మార్గమన్నారు. మెడికల్ కళాశాలలో చోటుచేసుకుంటున్న అనేక విషయాలపై ఫోన్ ద్వారా చర్చించిన ఆమెను కక్షపూరితంగా వేధింపులకు గురిచేసి అత్య, హత్యాచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అమానుష ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బలమైన చట్టాలను తీసుకురావాలని అన్నారు. దేశంలో నిత్యం ఏదో ఒక మూల మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, వీటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, మహేష్, శ్రీనివాస్, అన్వేష్, శంకర్, సాగర్, లక్ష్మి, అరుణ, నాగమణి, వరలక్ష్మి ముత్యాలు, రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

## అద్దంకి -నార్కెట్ పల్లి హైవేపై బైకును కారు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలు



సీకే న్యూస్ వేములపల్లి ఆగస్టు 20 :వేములపల్లి మండల కేంద్రంలో మంగళవారం బైక్ పై మిర్యాలగూడ నుండి నల్గొండ వైపు వెళుతున్నటువంటి ఉరుబండి వెంకన్న, ఎల్లబోయిన అజయ్ వారి పని నిమిత్తం వేములపల్లి వద్దకు చేరుకోగానే బస్టాండ్ ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటుండగా నల్గొండ నుండి మిర్యాలగూడ వైపు వెళు న్నటువంటి కారు వేగంగా ఢీ కొట్టింది హుటా హుటిన అక్కడికి చేరుకున్న వేములపల్లి పోలీస్ వారు 108 అక్కడికి పిలిపించి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది

## ప్రపంచ దోమలదినం



పలమనేరు నియోజకవర్గం, ఆగస్టు 20, సీకే న్యూస్. ప్రపంచ దోమల దినం సందర్భంగా, మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం అనే నినాదంతో, ఈరోజు మండల ప్రధాన వైద్యులు డాక్టర్ జె శ్రీనివాసులు, ప్రపంచ దోమల దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, సర్ రోనాల్డ్ రాస్ గారు 1897 సంవత్సరం ఆగస్టు 20న కనుగొన్నారని, ఆయన కృషి ఫలితముగా, మలేరియా వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశము కలిగిందని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, వ్యాధి పట్ల ప్రజల భాగస్వామ్యం, తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలను అప్రమత్రము చేయడం యొక్క ముఖ్య ఉద్దేశంతో ఈ దినాన్ని గుర్తు చేసుకోవడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లహరి వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు

## నేడు పొంగులేటి ఉచిత కోచింగ్ క్యాంప్ ప్రారంభం

సికె న్యూస్ ప్రతినిధి ,ఖమ్మం రూరల్ : పాలేరు నియోజకవర్గంలోని నిరుద్యోగ అభ్యర్థులను రానున్న పోటీపరీక్షలకు సన్నద్ధం చేసే ఉద్దేశ్యంతో రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న పొంగులేటి శీనన్న ఉచిత కోచింగ్ క్యాంప్ ను బుధవారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తున్నట్లు పొంగులేటి కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట సర్కిల్ బైపాస్ రోడ్ లో ఉన్న రామ్ లీలా ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కోచింగ్ క్యాంప్ ప్రారంభమౌతుందని ఆయన తెలియజేశారు. కోచింగ్ క్యాంపు కి పేరు నమోదు చేసుకున్నఅభ్యర్థులు అందరూ సకాలంలో హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి తో పాటు.. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి , రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల



నాగేశ్వరరావు, పాల్గొననున్నారని దయాకర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు.

సీ కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి ,ఆగస్టు 20,భారతదేశ మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జన్మదినం సందర్భంగా, టేకులపల్లి బోడు సెంటర్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహనికి టేకులపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు దేవా నాయక్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మహనీయుడు అని అన్నారు.
ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు భూక్యా దేవా నాయక్, మండల మహిళా అధ్యక్షురాలు కోరం మహాలక్ష్మి, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ బండ్ల రజిని,జిల్లా నాయకులు



కోరం సురేందర్, ఈది గణేష్, ఇస్లావత్ రెడ్యా నాయక్ ,మధు రెడ్డి,మూడ్ సంజయ్, బానోత్ శంకర్, అజ్మీరా శివ,పోషలు, ఈసాల బాబు, బండ్ల శ్రీనివారావు, సర్దార్, బానోత్ రవి, బోడ మంగీలాల్, సాంబ, రవీందర్ సింగ్, గుగులోత్ సక్రు, తదితరులు పాలొగొన్నారు.

## ప్రపంచ దోమల నివారణ దినోత్సవం



వి. ఆర్. పురం సీకే న్యూస్. అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లిలోని పి హెచ్ సి నందు ప్రపంచం దోమల దినోత్సవం ను మంగళవారం డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సబ్ సెంటర్ పరిధిలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దోమలు దినోత్సవం ఆగస్టు 20నా 1897సంవత్సరం లో బ్రిటిష్ శాస్త్రవేత్తడాక్టర్ రోనాల్డ్ రాస్ దోమలు వలన మనుషులుకు మలేరియా వస్తుందని కనుగొనటం జరిగింది ,ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎన్ వి బీడీ సీ ఫీ (నేషనల్ వేక్టర్ బోర్న్ డీజిస్ కంట్రోల్ ప్రోగ్రామ్ )ద్వారా కిటకా జానీతక్రిమి సంహారిని మందు ను ఇళ్లలో పిచకారి చేయటం దోమ తెరల వాడడం వాటి గూర్చి అవగాహన కల్పించారు నీటి నిల్వ లు తొలిగించుట మురికి గుంటలు లో లార్వా మందు పోయుట పరిసరాల పరిశుభ్రత పాటించాలని అలాగె ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమం లు చేయటం వలన దోమలను నివారించుచుని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో భద్రకాళి , పున్నమ్మ , చంద్రమ్మ, పార్వతి, మంగ, శ్రీనివాస్ , ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

## పలు గ్రామాల్లో వైద్య శిబిరలు

● సీజనల్ వ్యాధులపై అవగాహనా





సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి ,ఆగష్టు 20, టేకులపల్లి మండలం లోని పలు గ్రామాల్లో లచ్చగూడెం, కోయగూడెం, తుమ్మల చెలక, పాతర్ల గడ్డ, కోక్యా తండా, పాత తండా, గంగారం మరియు సులా నగర్ గ్రామాలలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి తగు చికిత్స అందించడం జరిగింది గంగారం లచ్చగూడెం గ్రామాల లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం లో మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఈ సీజన్లో వచ్చే వ్యాధులపై, కీటకాల ద్వారా వచ్చే వ్యాధులపై, కలుషితమైన ఆహారం నీటి ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.

వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పాటించడం అనేది మన జీవన విధానంలో ఒక భాగం గా చేసుకోవాలని , ముఖ్యంగా చేతులు అత్యంత పరిశుభ్రంగా కడుక్కోవాలని జలుబు దగ్గు లాంటి వ్యాధులు ఉన్నవాళ్లు మాస్కులు ధరించాలని తద్వారా ఇప్పుడు ప్రబలుతున్న వైరల్ జ్వరాలను అరికట్టవచ్చని అన్నారు

జ్వరాలు కీళ్ల నొప్పులతో ఎక్కువగా నమోదు అవుతున్నాయి కాబట్టి నిండుగా బట్టలు ధరించాలని ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ గారితో పాటు ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ,హెల్త్ సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగ బండి వెంకటేశ్వర్లు, గుజ్జ విజయ కౌసల్య మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి, రుక్సానా, శైలజ అమూల్య ఏఎన్ఎంలు వీరభద్రమ్మ మానస రమా కుమారి సుజాత స్వప్న సైదమ్మ కళావతి అనసూయ లక్ష్మీబాయి అరుణాదేవి వెంకటరమణ అరుణకుమారి దనసరి రాంబాబు అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగ,సెల్ఫోన్స్ వాడకం పై అవగాహన సదస్సు

● కోచ్ .కర్ణం గణేష్





సీ కే న్యూస్ చేగుంట ఆగస్టు 21 రిపోటర్ ( కొండి శ్రీనివాస్)చేగుంట మండల పటణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ నగేష్ పంపాటి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపవర్ నిర్మాణ్ వారోత్సవాల్లో భాగంగా యువత సాధికారత కార్యక్రమాన్ని 20వ ఆగస్టు 2024 నుండి 24 ఆగస్టు 2024 వరకు చేయడం జరుగుతుంది. ఈ యొక్క కార్యక్రమంలో భాగంగా శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో కార్యక్రమాణికు ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లికరణం గణేష్ రవికుమార్ లి ఆధ్వర్యంలో స్కూల్లోని విద్యార్థులకు మానసికంగా మరియు ఎంతో ఉపయోగపడే విధంగా యోగ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ యోగ తప్పకుండా చేయాల్సిన ఆవశ్యకత ఉందని,ప్రతి ఒక్కరు ప్రతి రోజు ఉదయం,సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకొని గాలి,వెలుతురు ఉన్నదగ్గర నిత్యం యోగా సాధన చేయాలని,యోగ వల్ల మానవ శరీరం లోని ఆరువందల కండరాలు,రెబ్బయిరెండు వేల నరాలు,రెండువందల ఆరు ఎముకలతో పాటు శరీరం మొత్త శుద్ధి చేయబడుతుందని,నిత్య యోగ సాధన వల్ల బిపి,షుగర్,గుండె జబ్బులు,క్యాన్సర్,తల నొప్పి,శరీర నొప్పులతో పాటు దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని,యోగాసనాతో పాటు రోజు వీలునుబట్టి ప్రాణాయామం,ముద్రలు,షట్ క్రీయలు,ధ్యానం సాధన చేయాలని,ధ్యానం వలన ఏకాగ్రతతో విద్యార్థులు చదువుపై మంచి పట్టు సాధించి ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులవుతారని ఆయన అన్నారు. యోగాను దేశ ప్రధాని నరేంద్రమోడీ గారు విశ్వ వ్యాప్తం చేయడం వల్ల స్పోర్ట్స్ కోటా లో చేర్చినందున,యోగ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు రెండు శాతం స్పోర్ట్స్ కోటా వర్తించి ఉద్యోగ,ఉపాధి,ఉన్నత విద్య లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గణేష్ అన్నారు. ఈ కార్యక్రమానికి గెస్ట్ గా వచ్చినటువంటి రామ్ ఫనిదర్ మాట్లాడుతూ సెల్ఫోన్ ప్రభావం వల్ల మూడునెలల పిల్లల నుండి వృద్ధుల వరకు సెల్ఫోన్ కు బానిసలు అయ్యారని ఈ అలవాటును తొందరగా మార్చుకోకపోతే శరీరం లోని కళ్ళు,మెదడు తో పాటు మెడకు సంబంధించిన మరియు వెన్నుమూకకు సంబందించిన నరాలు దెబ్బతింటాయని,ఈ అలవాటును సాధ్యమైనత తొందరగా మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేగుంట లయన్స్ ప్రెసిడెంట్ బుర్క నాగరాజు, సెక్రటరీ రజనకు రామచంద్రం, ట్రెజరర్ న్యాలపల్లి సతీష్, డీసి లింగమూర్తి, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఒంటరి రామ్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వరుగంటి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ కంతి రమేష్, సభ్యులు సూర్యప్రకాశ్, నాగేశ్వరయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ వివేక్, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆలోచనా విధానం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

దివంగత ప్రధాని జయంతి లో రాష్ట్ర మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి





సికె న్యూస్ ప్రతినిధి,కూసుమంచి: దివంగత ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ నవభారత నిర్మాణానికి ఎన్నో సంస్కరణలు చేశారని, ఆయన ఆలోచనా విధానం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని..

కూసుమంచి లోని ప్రధాన రహదారి వెంట ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. 1980 తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి పరిచయం చేసిన గొప్ప నేత అని కొనియాడారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో సరికొత్త పంథాను అవలంబించారని అన్నారు. అణగారిన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసి.. ఆదర్శ పాలన అందించారని తెలిపారు. రాజీవ్ గాంధీ కి జోహార్లు పలుకుతూ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను జయప్రదం చేయలి.

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సంగిశెట్టి క్రిస్టఫర్



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 20.తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని సెప్టెంబర్ 1న భువనగిరిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రకు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ ఉంటుందని ర్యాలీని జయప్రదం చేయడానికి ప్రతి ఉద్యమకారుడు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సమావేశానికి అధ్యక్షత వహించిన కదిరేని స్వామి నియోజకవర్గ అధ్యక్షులు జోగు అంజయ్య మహిళా కమిటీ అధ్యక్షురాలు గంధ మల్ల మల్లమ్మ .జిల్లా ఉపాధ్యక్షులు మంటి రమేష్. సీనియర్ నాయకులు శీలం స్వామి. జిల్లా నాయకులు మల్లం వెంకటేశం. చౌటుప్పల్ మండల అధ్యక్షులు గట్టు సుధాకర్ రామన్నపేట మండల అధ్యక్షులు నోముల శంకర్ బీబీనగర్ మండల అధ్యక్షులు ధారావత్ చంద్రభాను. బొడ్డుపల్లి లింగయ్య ఇమామ్. చౌటుప్పల్ శ్రీనివాస్. గంగ దారి సత్తయ్య. సిరిపంగి గణేష్. మంటి లింగయ్య. పబ్బు లక్ష్మయ్య. బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు .

● మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి. పట్టణ అధ్యక్షులు కనుకల కిష్టయ్య ఆధ్వర్యంలో.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 20.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని.

రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఘనంగా స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలు.

మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించినారు.

మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి. పట్టణ అధ్యక్షులు కనకాల కిష్టయ్య వారి ఆధ్వర్యంలో 80వ జయంతి వేడుకలు నిర్వహించి .రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి వారు మాట్లాడుతూ.

దేశం కోసం. ప్రాణాలు అర్పించిన అవిశ్రాంత వీరుడు. నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు. భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ సేవలను గురించి మాట్లాడినారు.


ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు పబ్బు ఉపేందర్ గౌడ్ బెలిదే నాగేశ్వర్ మండల నాయకులు సహదేవు. యుగేందర్ రెడ్డి. ఈతాప రాములు ధనంజయ గౌడు సోమేశ్ యూతు అధ్యక్షులు బత్తిని నాగేష్ గౌడ్. రేఖల ప్రభాకర్ .దయ్యాల శ్రీశైలం ఎమ్మే లింగస్వామి. రవి బాల నరసింహా రేసు బుచ్చిరెడ్డి కొమురయ్య. బాల నరసింహ పాల్గొన్నారు

## గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలి టి పి టి ఎఫ్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల అప్పీళ్లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బి.రాజు, జిల్లా కార్యదర్శి బి.బాలు, ఉపాధ్యాయ దర్శిని పత్రికా సంపాదకులు మునిగడప రామాచారి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.... తెలుగు మరియు హిందీ భాషా పండితులను వారి అంగీకారం లేకుండానే బాలికల పాఠశాలలకు కేటాయించడం జరిగిందని, వారి నుండి ఆన్లైన్ ద్వారా గాని, మ్యాన్యువల్ గా గాని ఆప్షన్లు తీసుకున్న తర్వాతనే పాఠశాలలు కేటాయించాలని. బదిలీల సీనియారిటీలో సీనియర్లుగా ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వాళ్ళ యొక్క ఆప్షన్ల ప్రకారం పాఠశాలలు కేటాయించ బడకుండా జూనియర్లకు కేటాయించ బడటం జరిగిందని, జరిగిన నష్టాన్ని నివారిస్తూ న్యాయమైన ఉత్తర్వులు ఇవ్వాలని, అదేవిధంగా పాఠశాల సహాయకుల కు పాఠశాలల కేటాయింపుల లో వివిధ రకాలుగా నష్టం జరగడాన్ని సరిచేయాల ని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో అప్పీళ్లను స్వీకరించడానికి అధికారులు లేకపోవడంతో అప్పీళ్ళు సమర్పించడానికి వచ్చిన ఉపాధ్యాయులు నిరాశ నిస్పృహలకు లోనై తీవ్ర ఆందోళనకు గురవుతున్నార ని, వెంటనే ఆయా ఉపాధ్యాయులను పిలిపించి వారి అప్పీళ్లను పరిశీలించి, చర్చించి న్యాయమైన ఆదేశములు విడుదల చేయాలని అధికారులను కోరారు. ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు శంకర్ పాల్గొని తమ మద్దతును ఉపాధ్యాయులకు తెలియజేశారు.



## చేగుంట కు బదిలిపై వచ్చినతాసిల్ దార్ నారాయణ



సీ కే న్యూస్ చేగుంట ఆగస్టు 21 రిపోటర్ ( కొండి శ్రీనివాస్) చేగుంట మండల్ కేంద్రనికి బదిలి పై వచ్చిన. తహసీల్దార్ సి .నారాయణ సోమవారం తేది: 19-08-2024 నాడు బాధ్యతలు స్వీకరించినారు. ఇంతకు ముందు హవెలి ఘణపూర్ తహసీల్దార్ గా పనిచేసి చేగుంట తహసీల్దార్ గా బదిలీ పై వచ్చినారు.

## షోడశ పెల్లి గ్రామంలో కొయ్యడ రవి మరణం దుఃఖ కరం




సి కె న్యూస్ ధర్మసాగర్ మండలం హనుమకొండ జిల్లా ప్రతినిధి కమలాకర్:వేలూరు మండలంలోని సోడా షా పల్లి గ్రామంలో కొయ్యడ రవి మరణం ఎంతో బాధాకరం తన కుమారులను కష్టపడి బస్తాలు మోస్తూ సాది వాళ్లని ఒక ఉన్నతమైనటువంటి స్థానంలో చూడాలని అనుకున్నటువంటి తరుణంలో అతను20 ,8, నెల2024 సంవత్సరంలో మంగళవారం ఈరోజు మన మధ్య కాలా సమయం నుండి విడిపోయి ఉన్నాడు. అతని కలలను నెరవేర్చడానికి మన మధ్యలో ఉన్నటువంటి ప్రతినిధులు స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య వీరు ఈ పిల్లలు పెద్దవాడు బిపిటి థర్డ్ ఇయర్ థెరపీ, రెండవవాడు చందు బీటెక్ ఫోర్త్ ఇయర్ పూర్తిచేసుకుని ఉన్నారు చదువుకున్నటువంటి అర్హతను బట్టి వాళ్లకు ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని ప్రజలు అనుకుంటూ ఉన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు ,బంధుమిత్రులు పాల్గొని ఉన్నారు.

# మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ జి. వేంకటేశ్వర రెడ్డి.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),ఆగస్టు 20,** సింగరేణి కాలరీస్ డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్) జి వేంకటేశ్వర రెడ్డి తమ అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం మణుగూరు ఏరియా కు విచ్చేసి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తో కలసి పికేఓసి-2, పికేఓసిక-4 ఉపరితల గనులను సందర్శించి క్వారిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని, య%శీ%త్రాల ద్వారా బొగ్గు లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు.
అనంతరం డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్) జి వేంకటేశ్వర రెడ్డి పికేఓసిర- 2, పికేఓసి-4 ఉపరితల గని అధికారుల తో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.... మణుగూరు ఏరియాలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్టమైన ప్రణాళికలు వెంటనే రూపొందించుకోవాలి. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పూర్తి స్థాయిలో రక్షణ పాటిస్తూ మణుగూరు ఏరియా 2024-25 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యమైన 126.5 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ ఏరియాకు నిర్దేశించిన బొగ్గు మరియు ఓబి లక్ష్యాలను చేరుకునేందుకు రోజు వారిగా లక్ష్యాలను సాధించాలి. పని గంటలు పూర్తిగా సద్వినియోగ పర్చుకుంటూ యాంత్రిక శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి మరియు ఓబివ వెలికితీత మరియు బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకం కలుగకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్య సాధనకు పాటుపడాలి. తద్వారా ఏరియా వార్షిక లక్ష్యాన్ని సాధించడంతో పాటు కంపెనీ వార్షిక లక్ష్యమైన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి తోడ్పడేలా మణుగూరు ఏరియా ఉద్యోగులు, సుపర్వైజర్లు, అధికారులు తన వంతు బాధ్యత నిర్వర్తించాలి. వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగ కుండా ఓపెన్ కాస్ట్ గనులలో చేరే వర్షపు నీటిని డిపార్ట్మెంటల్ మరియు ఔట్ సోర్సింగ్ ద్వారా బయటకు పంపే విధంగా ముందస్తు చర్యలు చేబట్టి సరిపడా మోటార్లు కండిషన్లో ఉండేలా సంబంధిత బాధ్యులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని డైరెక్టర్ ప్లానింగ్ %డ% ప్రాజెక్ట్ జి వేంకటేశ్వర రెడ్డి సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి పికేఓసి టి. లక్ష్మీపతి గౌడ్ , ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్ , డిజిఎం (ఐఈ) కే వెంకట్ రావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ పికేఓసిర వీరభద్రుడు , మేనేజర్ పికేఓసిసురేశ్ , మేనేజర్ పికేఓసిప %×ఎ% రమణ రెడ్డి, ఏరియా సెక్యూరిటి అదికారి షబ్బీరూద్దీన్ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో భారీ వర్షానికి కాలనీలు జలమయం



**యాదాద్రి యాదగిరిగుట్ట సి కె న్యూస్ ఆగస్టు 20 :** నిన్నటి నుంచి కురిసిన భారీ వర్షానికి యాదగిరిగుట్ట పట్టణంలో ని పలు కాలనీలు జలమయం అయ్యాయి. మున్సిపాలిటీని ప్రధాన డ్రె నేజీ కాల్వ కింది నుంచి బీసీ కాలనీ దగ్గర ఆరె శంకర్ ఇంటి ఆవరణం చె రువును తలపిస్తుందీ. రోడ్డు మొత్తం జలమయం కావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ ఆధికారులు వెంటనే స్పందించన డ్రెనేజ్ కాలువలో ఉన్న చెత్తను తొలగించి చర్యలు చేపట్టాలని కోరారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా" తెల్లం వెంకట్రావు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,**భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.
ఈ కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, పెద్దినేని శ్రీనివాస్, మండల అధ్యక్షులు సరేళ్ళ నరేష్, ప్రధాన కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, తాళ్ళపల్లి రమేష్ గౌడ్, భోగాల శ్రీనివాస్ రెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి,పుల్లగిరి నాగేంద్ర, కొప్పుల రాజా , ఒగ్గే రమణ, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరేళ్ళ వెంకటేష్, యూత్ నాయకులు గాడి విజయ్, ఆకుల వెంకట్, మాచినేని భాను, కల్లూరి భాను,మహిళ నాయకురాలు బోడ మణి, రమాదేవి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు...

# నేడే రవీంద్ర భారతి లో మాదిగ జర్నలిస్టు మహాసభ

- మాదిగ, మాదిగ ఉపకులాల రాష్ట్ర ప్రథమ మహాసభ
- జర్నలిస్టులు జిల్లా వ్యాప్తంగా తరలిరావాలి
- వస్కుల రామయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య ఆగస్టు 20**
నేడు రవీంద్రభారతిలో జరిగే తెలంగాణ మాదిగ ,మాదిగ ఉప కులాల జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వస్కుల రామయ్య తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుగుల నాగేందర్ ఆదేశాను సారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మాదిగ మాదిగ ఉపకులాల జర్నలిస్టులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముందుగా జర్నలిస్టుల సమస్యలపై పలు సూచనలు సలహాలు చర్చించడం జరుగుతుందని ప్రభుత్వం నుండి రావలసిన అన్ని వసతులు వచ్చే విధంగా అతిథులుగా వచ్చే మంత్రులకు ఎమ్మెల్యేలకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వారికి నివేదిక ఇవ్వటం జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరూ విధిగా సకాలంలో రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమానికి అందరూ చేరుకోవాలని తెలిపారు

# "ఐ ల్యాండ్" గురించి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్తాం





- మల్లేశ్వరం ఐ ల్యాండ్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ


**సీకే న్యూస్ ప్రతినిధి, కొల్లాపూర్:**
పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామ పరిధిలోని చుట్టూ కృష్ణానది ఉన్న చోట ఒక ద్వీపం లా 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఐ ల్యాండ్ ను మల్లేశ్వరం గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులతో కలిసి జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ కల్వరాల నరసింహ సందర్శించారు అనంతరం వారు గ్రామ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు అయిన తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఇక్కడికి పర్యాటకులు వచ్చేలా తెలంగాణ ప్రభుత్వం ఆద్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు గౌరవ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మల్లేశ్వరం ఐ ల్యాండ్ ను ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామనీ వారు తెలిపారు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే మంత్రి జూపల్లి కృష్ణారావు ఐ ల్యాండ్ ను సందర్శించేలా వారితో మాట్లాడి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని గ్రామ నాయకులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు మంత్రి జూపల్లి ప్రధాన అనుచరులు తదితరులు పాల్గొన్నారు


# ప్రగతిశీల యువజన సంఘం శిక్షణ తరగతులు పి వై ఎల్




**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ఆగస్టు 20 సి కె న్యూస్ :**ఈనెల 22,23న మహబూబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో పివైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీలలో మహబూబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో కామ్రేడ్ పగడాల వెంకన్న నగర్ లో రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం కోరుతూ యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరించి, ప్రచారం చేయడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పాల్గొని మాట్లాడారు. యువతరం నేడు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యువతరం అధ్యయనం, చైతన్యం కావడం కోసం ఈ రాజకీయ శిక్షణ తరగతులను జరుపుతున్నామన్నారు. ప్రభుత్వాలు, పాలకులు యువతరాన్ని నిర్వీర్యం చేసే విధానాలను తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. యువతరం పెడదోరణిలోపడి మద్యపానం, మత్తుపానీయాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ఊబిలో పడి తమ జీవితాలను రోడ్డు పాలు చేసుకుంటున్నారన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగ సమస్యతో డిగ్రీలు, పీజీలు పొంది ఉన్న నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఒకపక్క రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వైరల్ జ్వరాలతో గ్రామాలకు గ్రామాలు మూలుగుతున్నాయన్నారు. ప్రజలకు వైద్యం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ వైద్య వ్యవస్థను, విద్యావ్యవస్థను బలహీనపరిచి ప్రైవేటు రంగ వైద్య వ్యవస్థను, విద్యావ్యవస్థను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రపంచీకరణ పేరుతో దేశ వనరులను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టి దేశాన్ని తాకట్టు పెడుతున్నారన్నారు. దేశ సంపదను కాపాడుకోవడం కోసం యువత చైతన్యవంతంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జరుపుతున్నామన్నారు. ఈ శిక్షణ తరగతులకు యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యార మహేందర్ , నమిలే ఎల్లయ్య, సుంచు ఆంజనేయులు, గ్యార నరసింహులు, సుంచు రాములు, గ్యార మాతయ్య, వంగపల్లి యాదగిరి,బీబీనగరం ఐలయ్య, బిక్షపతి ,నరేందర్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం మల్టీప్లెక్స్ కాంప్లెక్స్.



**సేవ్ భద్రాద్రి అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్.**
**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఆగస్టు 20,**భద్రాచలం సేవ్ భద్రాద్రి రెండు సంవత్సరాల క్రితం వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన నిధులతో గోదావరి వరదలు సమయంలో ప్రజల సౌకర్యార్థం మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు సేవ్ భద్రాద్రి అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో సేవ్ భద్రాద్రి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం పక్కన గల 20 సెంట్లు భూమిలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నామని, ఈ నెల 28 న భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు. హాల్ నిర్మాణం వలన పట్టణంలోని వరద వచ్చిన సందర్భాల్లో ముంపు కాలనీ ప్రజలకు వసతి, ఇతర రోజుల్లో భక్తులకు అలాగే పట్టణంలోని చిన్న మధ్య తరగతి కుటుంబాలు వేడుకలు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు రూ.36,91,000 దాతలు సహకరించారని తెలిపారు. సుమారు కోటి రూపాయల నిధులతో భవనం నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రజలు సహాయ సహకారాల వలన ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈనెల 28వ తేదీన పూజా కార్యక్రమాలు ఉన్నందున పట్టణంలోని ప్రముఖులు, ప్రజలందరూ హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సేవ్ భద్రాద్రి.కార్యదర్శి చారుగుళ్ల శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్ కే అజీమ్,సభ్యులు పరిమి సోమ శేఖర్, గాదె మాధవ రెడ్డి,శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ జి ఎఫ్ గేమ్స్ కు విద్యార్థులు సన్నద్ధం చేయాలి

- వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో
- ఎంఈఓ సైదా నాయక్



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య ఆగస్టు 20:** హుజుర్నగర్ నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం
మంగళవారం హుజుర్నగర్ ఎంఈఓ సైదా నాయక్ ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు హై స్కూల్ నందు జరిగింది
ఈ సమావేశం లో ఎస్ జి ఎఫ్ గేమ్స్ 14సం నుండి 17సంవత్సరాల బాల బాలికల ఆటల పోటీలు మండల స్థాయి ఆగస్టు 31లోపు మరియు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు సెప్టెంబర్ 15లోపు నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను సంక్షిప్తం చేయాలని సమావేశంలో కోరారు. ఈ కార్యక్రమంలో మట్టంపల్లి ఎంఈఓ ఛత్రు నాయక్
స్థానిక హై స్కూల్ హెచ్ఎం బిరెల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు ఎస్ జి ఎఫ్ సెక్రటరీ దేవిశెట్టి రవి మరియు వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాగ్దానాల అమలకై ఉద్యమిద్దాం.

- ఆగస్టు 22వ తారీఖున ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయండి.
- సీపీ ఐ యం ఎల్ మాస్ లైన్ ప్రజాపందా పార్టీ చర్ల మండల కమిటీ.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,**చర్ల మండల పరిధిలోని తేగడ గ్రామంలో ఆగస్టు 22వ తారీఖున హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరగనున్న ధర్నా ను జయప్రదం చేయుటకై సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమల కై ఆగస్టు 22వ తారీఖున చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ కార్యకర్తలకు సానుభూతి పరులకు ఆయన మంగళవారం పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి పది లక్షల రూపాయలను గృహనిర్మాణానికై చెల్లించాలని పోడు సాగుదారులందరకు పట్టాలను అలాగే సాగు హక్కులను కల్పించాలని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన 12 వేల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని జీవన వ్యాయాని కి అనుగుణంగా పెంచాలని అర్హులైన వారందరికీ ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యలన్నిటి పరిష్కారం కై హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 22వ థారికున జరగనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలకు సానుభూతిపరులకు సమస్త మండల ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు చేన్న%శీ% మోహన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు





**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య ఆగస్టు 20:**హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జునరావు అధ్యక్షతన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని రాజీవ్ చౌరస్తా లో రాజీవ్ గాంధీ విగ్రహానికి రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎరగాని నాగన్న గౌడ్, మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతిని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1944 ఆగస్టు 20 న జన్మించారని 40 ఏళ్ల వయసులో భారత యువ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ బహుశా ప్రపంచంలోనే అతి పెద్ద వయసులైన ప్రభుత్వ అధినేతల్లో ఒకరు అని రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో సాంకేతిక పరంగా తీసుకువచ్చినటువంటి మార్పులలో భాగంగానే ఈరోజు సాంకేతికత వ్యవస్థ లో విప్లవాత్మక మార్పులు వచ్చి భారతదేశం అభివృద్ధి బాటలో ముందుందని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేస్తారని తెలియజేసినారు.

## పోలవరం నూతన తాసిల్దార్ కు శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు : కొణతాల ప్రసాద్.





**పోలవరం సీ కే న్యూస్** పోలవరం మండలం కు నూతన తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన బిఎస్ఎల్వీఆర్,రాజు ను తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఇసుక కాలువ గండిపడడంతో పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని తాసిల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో చెంచానీ, ప్రసాద్, కాప, రాంబాబు, నౌడు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పంట ఈక్రాప్ తప్పనిసరిగా చేసికోవాలి

- ఎంపీటీసీ బిశెట్టి శ్రీనివాసరావు



**అనకాపల్లి సీ కే న్యూస్** మండలం మేజర్ పంచాయతీ కస్పా జగన్నాధపురంలో రైతు సోదరులకు విజ్ఞప్తి. మాడుగుల రెవెన్యూ పరిధి మరియు పప్పు శెట్టి సేరి లో భూమి ఉన్న రైతులు వారి యొక్క ఆధార్ కార్డు, మరియు 1 -%దీ% లను మాడుగుల విశాఖ గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్నటువంటి రైతు భరోసా కేంద్రం - 3 కి వెళ్లి వారి యొక్క పంటను ఈక్రాఫ్ బుకింగ్ చేసుకోగలరని కోరుచున్నాను. ఈ క్రాఫ్ట్ బుకింగ్ చేసుకోవడం వలన దీని ఆధారంగా అన్నదాత సుఖీభవ (ఇంతకుముందు రైతు భరోసా) మరియు పంట నష్టం నమోదు చేసుకొనుటకు ఉపయోగపడుతుంది. కావున రైతు సోదరులందరూ ఈ విషయాన్ని గమనించి , అశ్రద్ధ చేయకుండా వెంటనే మాడుగుల రైతు భరోసా
కేంద్రం - 3 కి వెళ్లి వారి యొక్క పంటను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోగలరని తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ బిశెట్టి శ్రీనివాసరావు కోరారు

## విద్యార్థులకు ,పుస్తకాలు మరియు ప్యాన్ లు, అందించిన అంబేద్కర్ ట్రస్ట్ సభ్యులు





**అనకాపల్లి సీ కే న్యూస్ :**
చోడవరం స్థానిక అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, రిటైర్డ్ సివిల్ జడ్జి నడుపూరు సన్యాసిరావు ఆధ్వర్యంలో చోడవరం పట్టణంలో గల ఇందిరా కాలనీలో గల,సాంఘిక సంక్షేమ శాఖ మహిళా హాస్టల్ కి మరియు ఎల్ఐసి కాలనీలో సాంఘిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసిత గృహానికి విద్యార్థినీ విద్యార్థులకు 4 ఫ్యానులు మరియు నోటు పుస్తకాలు పెన్నులు అందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ యొక్క ఆశయ సాధనకు విద్యార్థిని విద్యార్థులు అందరూ కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ కార్యనిర్వాహకులు కండెల్లి వెంకట్రావు మాస్టారు, జింజర్ అప్పారావు .వి .పైడ్ రావు మాస్టారులు మరియు అడ్వకేట్ భూపతి రాజు. హాస్టల్ వార్డున్ బి. ఈశ్వరరావు, మరియు జి.వరలక్ష్మి విద్యార్థినీ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పిల్లలూ.. బాగా చదివి కలెక్టర్, ఎస్పీ కావాలి.

- కష్టపడితేనే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉంటారు.
- విద్యార్థులకు సూచించిన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి.
- సున్నం బట్టి ఆశ్రమ పాఠశాల, వసతి గృహం పరిశీలన.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,**
అశ్వారావుపేటలో "పిల్లలూ.. ఇక్కడ సౌకర్యాలు ఎలా ఉన్నాయి?. మంచిగా చదువుకుంటున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? మేము ఎవరో తెలుసు కదా...? చెప్పండి. మీ సమస్యలు ఏమున్నా పరిష్కరిస్తాం. బాగా చదువుకోండి మరి" అంటూ.. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి విద్యార్థులతో అన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండలం సున్నం బట్టి గ్రామంలో గల ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలను తనిఖీ చేశారు. ప్రాంగణమంతా కలియ తిరిగి, వంటగది, విద్యార్థుల గదులు పరిశీలించారు. అనంతరం పిల్లలతో కాసేపు మాట్లాడారు. ఆ వివరాలు ఇలా.

**మీ కలెక్టర్, ఎస్పీ సార్ మాదిరి ఉన్నతంగా నిలవాలి**
మీకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి మీ కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ మాదిరిగా మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలని మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి సూచించారు. అక్కడున్న ఓ బాలుడు తన పేరు మహేష్ అని చెప్పగా.. నువ్వు పెద్దయ్యాక హీరో మహేష్ బాబు లాగా అవుతావా మరి అని అడగడంతో అక్కడున్న వారంతా నవ్వారు.

**మేమెవరమో తెలుసు కదా..**
అరేయ్ పిల్లలూ.. నేను తెలుసు కదా అని పిల్లలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రశ్నించారు. దీంతో చాలామంది వో.. తెలుసంటూ తలలూపారు. ఆ తర్వాత మంత్రి పొంగులేటి ఎంపీ రఘురాంరెడ్డిని, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ను, కలెక్టర్, ఎస్పీలను పిల్లలకు పరిచయం చేశారు.

**ఆ గుగ్గిళ్ళు సరిపోతున్నాయా..?**
**కాసేపు పిల్లలతో సరదా సంభాషణ**
ఈ హాస్టల్లో 110 మంది పిల్లలు ఉంటే ఆ చిన్న గిన్నెలో గుగ్గిళ్ళు ఉడక పెడుతున్నారు.. అవి సరిపోతాయా రా మీకు..? అంటూ మంత్రి పొంగులేటి ప్రశ్నించడంతో అక్కడున్న పిల్లలు.. పెద్దలు సరదాగా నవ్వుకున్నారు. చికెన్ ఎప్పుడు పెడుతున్నారు.. భోజనం బాగుంటుందా.. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అంటూ మంత్రి, ఎంపీ ప్రశ్నించారు.

**మాకు బెడ్ షీట్లు, బంగాళదుంప కూర కావాలి**
తమకు బెడ్ షీట్లు, పరుపులు లేవని.. అందరికీ పూర్తిస్థాయిలో అందలేదని విద్యార్థులు మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి ఎదుట వాపోయారు. దీనికి మంత్రి, ఎంపీ స్పందిస్తూ తప్పకుండా ఈ సమస్యలు పరిష్కరిస్తామని..మీరు బాగా చదువుకోవాలి అని వారు సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎట్టి ప్రకాష్ ఆత్మ హత్య యత్నానికి కారకులు అయిన రెవిన్యూ అధికారుల పైన అట్రాసిటీ కేసు నమోదు చేయాలని..

- "ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఏ ఎన్ ఎస్ రాష్ట అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి"
- "ప్రజా ప్రభుత్వం అంటే ఆదివాసీల పైన దాడులు చేయడమా..?"
- "ప్రభుత్వ భూములను కబ్జా చేసిన గిరిజనేతరులను ఎందుకు ఖాళీ చేయడం లేదు..?"



**" ములుగు జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి భార్గవ్"** ప్రజా ప్రభుత్వంలో ఆదివాసీల పైన, ఆదివాసీ చట్టాల పైన అధికారుల మూక దాడులు అధికం అయ్యాయని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. ప్రజా ప్రభుత్వం లో ప్రభుత్వ అధికారుల పాశవిక పోకడలు అప్రజాస్వామికంగా ఉన్నాయని ఆయన ధ్వజం మెత్తారు . ఏటూరునాగారం మండల కేంద్రం లోని ఎట్టి ప్రకాష్ నివాసాన్ని తొలిగించాలని దౌర్జన్యానికి పాల్పడ్డ రెవిన్యూ అధికారుల పైన ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవిన్యూ అధికారుల ఒత్తిడి కారణంగానే ఎట్టి ప్రకాష్ ఆత్మ హత్యా యత్నానికి పాల్పడినట్టు ఆయన పేర్కొన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేఖంగా ప్రభుత్వ భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసి, వడ్డీ వ్యాపారాలు చేస్తూ ఉంటే రెవిన్యూ అధికారులు నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేయక పోగా అక్రమార్కులకు అండగా నిలబడుతున్న అధికారులను న్యాయస్థానాల్లో నిలబెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల తో పాటు, ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులు కోట్ల రూపాయలు పెట్టి క్రయ విక్రయాలు చేస్తూ రియల్ దందాకు పాల్పడుతూ ఉంటే రెవిన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో ఊగు తున్నారని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో అసలైన భూ యజమానులు ఆదివాసీలు మాత్రమే అన్నారు. ఏక రూప పరిపాలన అధికారం కలిగిన ప్రాజెక్ట్ అధికారి పని చేస్తున్న కార్యాలయం ముందే గిరిజనేతరులు ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఉన్న ఎటువంటి చర్యలు లేకపోవడం చూస్తే ప్రాజెక్ట్ అధికారిణి తీరు గిరిజన చట్టాలకు వ్యతిరేకం అని అర్ధం అవుతోందన్నారు. జిల్లాలో ముఖ్యమైన మంత్రి పదవిలో కొనసాగుతూ ఇప్పటి వరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ని ఎందుకు నియమించ లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆదివాసీల పైన అక్రమ కేసులు పెట్టకుండా జిల్లా మంత్రి చూడాలని కోరినారు. ఎల్ టి ఆర్ కోర్టు నడవక పోవడం తో అన్యాక్రాంతం అయిన ఆదివాసీల భూములకు న్యాయ పరమైన రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల నియంత పాలన తర్వాత ప్రజా పాలన వచ్చిందన్న ఆదివాసీల ఆశలు ఆవిరి అయిపోతునట్లు తెలియజేసారు. రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థలు అయిన రాష్ట్ర ఎస్టీ కమిషన్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సలహా మండలి ఏర్పాటు సత్వరమే జరగాలని అన్నారు.

# అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం.

**నిర్వహించిన రెవెన్యూ,హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 20,**అశ్వారావుపేట మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి, నారాయణ పురం,వినాయక పురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయితీ కార్యాలయ భవనాలను ప్రారంభించిన మంత్రి.
అనంతరం అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ శ్రీ కల్యాణ మండపంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. తెలంగాణా రాష్ట్రాన్ని గత పది సంవత్సరాలు పాలించిన పెద్దోళ్ళు అవాకులు చవాకులు పేలుతున్నారు.. కావాలని రైతులను రెచ్చగొట్టే ప్రక్రియలు చేస్తున్నారు. ఏ ఒక్క రైతు అభద్రత భావనకు లోనవ్వొద్దు.. ఇప్పటికే వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాము.అర్హులైన వారికి ఇంకా ఎన్ని వేల కోట్ల రుణమాఫీ అయిన ఈ ప్రభుత్వం చేయటానికి సిద్ధంగా ఉంది. ఇది పేదోడి ప్రభుత్వం. ఇందిరమ్మ రాజ్యం. ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చటమే లక్ష్యంగా పనిచేస్తుంది. రైతులను రెచ్చగొట్టే పనులు చేస్తే సహించేదే లేదు కనీసం ప్రతి పక్ష హొదాని కూడా దక్కించుకోలేని స్థితిలో ఆ పార్టీ ఉంది అంటూ సెటైర్లు వేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. అటవీశాఖ అధికారులను భూ సర్వే విషయంలో రైతులతో అతి ఉత్సాహం చెయ్యద్దంటు చెప్పిన మంత్రి పొంగులేటి.
అనంతరం ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్ పై పొంగులేటి ఫైర్.. పొంగులేటి అడిగిన ఏ ఒక్క విషయానికి సరైన జవాబు చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో ఇళ్ళ పై వెళ్ళిన హైటెన్షన్ వైర్లను ఎటువంటి ఎస్టిమోషన్స్ ప్రజల పై వేయకండ డిపార్ట్మెంట్ నుండే క్లియర్ చేయాల్సిందిగా విద్యుత్ శాఖ కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్యశాఖ అధికారులు వైద్యులు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని, హాస్పటల్ ఆకస్మిక తనిఖీలు చేస్తామని అలసత్వం ప్రదర్శించిన వైద్యులు లేదా వైద్య సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులను హెచ్చరించారు. విద్యా శాఖాధికారుల తో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మరియు టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.
గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా శక్తి రుణాలు అర్హులైన మహిళా సంఘాలను గుర్తించి స్థానిక శాసనసభ్యుల అనుమతితో మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు.
పర్యటనలో మంత్రితో పాటు పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి,ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజ్, మువ్వా విజయ్ బాబు మరియు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్టన్నింగ్ సామ్.. సిట్టింగ్ పోజులో పైటను పక్కకు జరిపి



స్టార్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చి రెస్ట్ మోడల్ ఉంటున్న సంగతి తెలిసిందే. ఆ మధ్య వెకేషన్ ట్రిప్‌లు అంటూ ఫుల్ ఎంజాయ్ చేసిన ఈ భామ.. సోషల్ మీడియాలోనూ వాటిని షేర్ చేస్తూ ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంది. మధ్య మధ్యలో ఫొటోషూట్స్ కూడా చేస్తూ అభిమానులను అలరించింది. తాజాగా మరోసారి పైట పక్కకు జరిపి పింక్ కలర్ శారీలో సిట్టింగ్ పోజు ఇచ్చి ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. చూపు తిప్పుకోకుండా చేసే అందం, మైమరపించే నటనతో దాదాపు పదిహేనేళ్లుగా టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా హవాను కొనసాగిస్తూ దూసుకుపోతోంది టాలెంటెడ్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు. గతంలో కన్నా ఆ మధ్య పుష్పతో తన స్టార్ డమ్‌ను మరింతగా పెంచుకున్న ఈ ముద్దుగుమ్మ.. వరుస పెట్టి సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ ముందుకు వెళ్తోంది. అయితే రీసెంట్‌గా మయోసైటిక్ ట్రీట్‌మెంట్ సహా కాస్త ప్రశాంతంగా ఉండేందుకు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. అయినా సోషల్ మీడియాలో యమ రచ్చ చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే తన పర్సనల్ విషయాలతో పాటు హాట్ ఫొటోషూట్స్?ను పోస్ట్? చేస్తూ ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. అయితే ఈ మూడు నాలుగు రోజుల నుంచి వరుసగా చీరలో అందాలను ఆరబోస్తూ రోజుకో ఫొటోను పోస్ట్ చేస్తోంది. తాజాగా పింక్ కలర్? శారీలో అదిరిపోయే పిక్?ను షేర్ చేసింది. బ్యాక్? గ్రౌండ్ కలర్ కూడా మ్యాచింగ్ అయ్యేలా పింక్? వరల్డ్?లో కనువిందు చేసింది. సిట్టింగ్? పోజులో పైటను పక్కకు జరిపి ఎద అందాలను ఎక్స్?పోజ్? చేసింది. కాస్త స్మైలింగ్ కూడా ఇచ్చింది. ఈ ఫొటోకు ఓ వేదాంతం కూడా రాసుకొచ్చింది. "సుతిమెత్తనైన ఈ చక్కటి ఎంబ్రాయడరీ కలిగి ఉన్న పింక్ కలర్?? చీర.. మీరు కలలు కనే ధైర్యాన్ని, దాన్ని సాకారం చేసుకునే అవకాశమున్న మాయాలోకానికి మార్గం చూపుతోంది. ఆకర్షితమైన ఈ మాస్టర్ పీస్ అందాలకు దాసోహమయ్యేందుకు సిద్ధంగా ఉండండి. ఎందుకంటే ఈ చక్కటి కలల ప్రపంచంలో నక్షత్రాల వెలుతురు నడుమ మీ హృదయం ఆకాశంలో తేలిపోతుంది" అని రాసుకొచ్చింది.


## ది సిజ్లింగ్ సిస్టర్ ద్వయం: నేహా మరియు ఐషా శర్మ చిత్రాలలో మెరుస్తున్నారు





సాయి మంజ్రేకర్ తాజా స్పైసీ చిత్రాలు అప్రయత్నంగా స్పాట్‌లైట్‌ను దొంగిలించాయి

# తెలుగు సినిమాలపై ఆసక్తి చూపించని భామ..!



మలయాళ భామ మాళవిక మోహనన్ తెలుగు సినిమాల మీద ఆసక్తి చూపించట్లేదా అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. మలయాళంలో కెరీర్ మొదలు పెట్టి తమిళ, కన్నడ సినిమాల్లో చేస్తున్న ఈ అమ్మడు తెలుగులో మొదటి అవకాశం ప్రభాస్ మూవీ అందుకుంది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ లో మాళవిక మోహనన్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. అయితే తెలుగులో డైరెక్ట్ గా సినిమాలు చేయకపోయినా ఆమె నటించిన సినిమాలు డబ్ అయ్యి తెలుగులో రిలీజ్ అయ్యాయి. అలా తెలుగు ఆడియన్స్ కు దగ్గరైంది మాళవిక. ప్రభాస్ సినిమాతో పాటు కోలీవుడ్ లో విక్రం హీరోగా వస్తున్న తంగలాన్ సినిమాలో కూడా అమ్మడు నటిస్తుంది. రీసెంట్ గా రిలీజైన తంగలాన్ టీజర్ లో మాళవిక లుక్ చూసి ఆమె ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఫోటో షూట్ లో తన గ్లామర్ తో మెప్పిస్తూ వచ్చిన మాళవిక తంగలాన్ లో డీ గ్లామర్ రోల్ లో సర్ ప్రైజ్ చేస్తుంది. ప్రభాస్ సినిమాలో నటిస్తుందని తెలిసి టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తా అంటున్నా మాళవిక మాత్రం నో అనేస్తుందట. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాక చేస్తా అని కొందరికి చెబుతుంటే.. రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేస్తుందని టాక్. తెలుగులో పాన్ ఇండియా సినిమాల మీద అమ్మడి ఫోకస్ ఉందని తెలుస్తుంది. అందుకే మాళవిక మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాకే నెక్స్ట్ తెలుగు సినిమా చేయాలి అప్పుడైతేనే తన రేంజ్ కి తగిన ఛాన్స్ వస్తుందని భావిస్తుంది మాళవిక. సినిమాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ లో ఉంటున్నాయి. సౌత్ లో సోషల్ మీడియా ఫాలోయింగ్ లో అదరగొట్టే భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. అయితే ఫోటో షూట్స్ మాత్రమే కాదు సినిమాలతో కూడా తన సత్తా చాటాలని కోరుతున్నారు ఆమె ఫాలోవర్స్. మిగతా భామలంతా కూడా తెలుగులో ఛాన్స్ లు వస్తే బాగుంటుందని కోరుతుంటే మాళవిక మాత్రం ఇక్కడ దర్శక నిర్మాతలు ఆమె వెంట పడుతున్నా సరే కాదని చెప్పేస్తుంది. ప్రభాస్ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకున్న మాళవిక ఆ సినిమాతో తన కెరీర్ గ్రాఫ్ పెంచుకుంటుందా లేదా అన్నది చూడాలి. స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా అమ్మడు వచ్చిన అవకాశాలను కాదని చెప్పడం వల్లే రేసులో మాళవిక వెనుకబడి ఉందని చెప్పుకుంటున్నారు.